మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



### డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు

# ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి:కలెక్టర్



డ్రగ్స్ నిర్మూలన గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**వనపర్తి ప్రతినిధి, జూన్ 25 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. జూన్ 20 నుంచి 26 జిల్లాలో వరకు నిర్వహిస్తున్న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, నిర్మూలన కార్యక్రమంలో భాగంగ బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి డ్రగ్స్ నిర్మూలన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యువత మాదక ద్రవ్యాల వినియోగం బారిన పడకుండా తల్లిదండ్రులు, అధ్యాపకులు, సమాజంలోని ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా జరుగకుండా పోలీస్ యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం రవాణా పై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు జూన్ 26 న ఉదయం 7.00 గం.లకు స్థానిక బాయ్స్ జూనియర్ కళాశాల మైదానం నుండి పాలిటెక్నిక్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, పోలీస్ అధికారులు పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

### విద్యార్థులను పరీక్షించి..

# కలిసి భోజనం చేసి

ధర్మాపూర్ జడ్.పి.ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 25 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ రూరల్ మండలం ధర్మాపూర్ గ్రామంలోని జడ్‌పి ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం తనిఖీ చేశారు. జడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు మెనూ పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం గురించి ప్రధానో పాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. తరగతి గదిలో సాంఘిక శాస్త్రం బోధన చేస్తున్నారు. బోర్డు పైన ఇండియా మ్యాప్‌లో ఉత్తర దిశలో రాష్ట్రాలు గురించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. విద్యార్థులు విద్యార్థినులతో పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎలా ఉంది. సౌకర్యాలు ఎలా ఉన్నాయి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో వారు భవిష్యత్ లో ఏ రంగంలో స్థిరపడాలని అనుకుంటున్నారు అని అడిగారు. తెలుగు భాష చదవడం రాయడం తోపాటు హిందీ,ఇంగ్లీష్ భాష లలో కూడా చదవడం,రాయడం నైపుణ్యం సంపాదించాలని సూచించారు. తప్పులు పోయిన బాగా ప్రాక్టీస్ చేయాలని, క్రమంగా పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు తర్వాత పిల్లలతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. డిజిటల్ (ఏఐ) కంప్యూటర్ ల్యాబ్ బోధన గురించి కంప్యూటర్‌లు బోధన గురించి తెలుసుకున్నారు. రోడ్డుకు అవతలి వైపు ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు రోడ్డు దాటి ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌కు రావడం ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకు వచ్చారు. జడ్‌పి ఉన్నత పాఠశాలల్లో ఉన్న 5 కంప్యూటర్‌లలో రెండు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అందచేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ తో పాటు జడ్.పి.ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపి కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

### శ్రీ కురుమూర్తి కొండకు

# పోటెత్తిన భక్తజనం



శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకుంటున్న భక్తులు

**చిన్న చింతకుంట, జూన్ 25 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలవబడుతూ పేదల తిరుపతిగా పిలువబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. బుధవారం ఆషాడ మాస ప్రారంభ అమావాస్య కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి భక్తులు బస్సుల్లో, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కాలినడకన శ్రీ కురుమూర్తి స్వామి కొండకు ఉదయాన్నే చేరుకున్నారు.కొండ దిగువన స్వామివారికి భక్తులు కర్పూర దీపాలు వెలిగించారు. క్యూలైన్లో భక్తులు బారులు తీరి ప్రధానాలయంలోని శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఉద్దాల మండపంలో స్వామివారి పాదుకలను తాకి భక్తులు పునీతులయ్యారు. కొండపై క్యూలైన్లలో బారులు తీరిన భక్తుల గోవింద నామస్మరణతో కాంచన గుహ పులకరించింది. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్నదానాన్ని నిర్వహించారు. జాతర మైదానం భక్తులతో నిండిపోయింది.

### పర్యాటక రంగం అభివృద్ధికి

# పుష్కలమైన అవకాశాలు

- సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టును అద్భుతంగా తీర్చిదిద్దుతాం...
- అమరగిరి ద్వీపం, ఇతర పర్యాటక ప్రాంతాల సందర్శన...
- పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్



పర్యాటక, ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా మంత్రి జూపల్లి సోమశిల, అమరగిరి, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, నార్లాపూర్ రిజర్వాయర్, కొల్లాపూర్‌లోని మాధవస్వామి ఆలయం, జెటప్రోలు మదనగోపాల స్వామి దేవాలయాన్ని సందర్శించారు. పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రి జూపల్లి వెంట పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఇతర అధికారులు సందర్శించారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టమెంట్(సాస్కి) పథకం కింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్‌కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పర్యాటక శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యాచరణపై పర్యాటక శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు కేవలం టూరిజం ద్వారానే అభివృద్ధి చెందాయని, రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకువెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. త్వరలో టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకెళ్తామని, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని అన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/యూనియన్ టెరిటరిస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టమెంట(సాస్కి) పథకం కింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్‌కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, మల్లేశ్వరం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. క్లస్టర్ 1: ఈగలపెంట అరైవల్ జోన్, ఈగలపెంట విహార యాత్ర, ఈగలపెంట రివర్ క్రూయిజ్, చెంచు ట్రైబల్ ఎక్స్‌పీరియన్స్, క్లస్టర్ 2: సోమశిల వెల్నెస్ అండ్ స్పిరిచ్యువల్ రిట్రీట్ ఉంటాయని అన్నారు. సోమశిలలో బోటింగ్ జెట్టి, అమరగిరి ద్వీపంలో బోటింగ్ జెట్టి, కాటేజీలు, స్విమ్మింగ్ పూల్, కేఫ్టీరియా, స్పా, వెల్ నెస్ సెంటర్, ఇండోర్ అవుట్ డోర్ గేమ్స్, ఇతర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా జూరాల డ్యాం



# 13గేట్ల ద్వారా దిగువకు..

- జూరాలకు పెరుగుతున్న వరద
- 92,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు

**మహబూబ్‌గర్ బ్యూరో, జూన్ 25, ప్రభాతవార్త:** ప్రియదర్శిని జూరాల డ్యామ్ కు వరద క్రమంగా పెరుగుతున్నది. ఎగువ ప్రాంతం కర్ణాటక నుంచి వరద పోటెతడంతో జూరాల నిండుకుండలా మారింది. దీంతో 13 గేట్ల ద్వారా దిగువన శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల కొనసాగుతున్నది. బుధవారం జూరాలకు 92,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు కాగా ఏడు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. జూరాల కెపాసిటీ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 8.010 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 33,169 క్యూసెక్కులు స్పిల్ వే ద్వారా 51779 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడవ కాలువకు 550, క్యూసెక్కులు, కుడి కాలువకు 298 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 85805 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

### స్కూల్ బస్సులో తనిఖీ

# పకడ్బందీగా చేయాలి

మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం



డిటిసిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 25 ప్రభాతవార్త:** ఉపరవాణా శాఖ కమిషనర్ కార్యాలయం ద్వారా వాహన దారులకు, యజమానులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లాకలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్ ఉపరవాణా కమిషనర్(డిటిసి) కార్యాలయంను సందర్శించారు. డ్రైవింగ్ ట్రాక్‌ను పరిశీలించారు.డ్రైవింగ్ ట్రాక్‌ను ఆధునీకరణ చేయాలని సూచించారు. జప్తుచేసిన వాహనాలు పరిశీలించి వాటిని ఒక క్రమపద్ధతిలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తు దారులు వేచి ఉండు గదిని సందర్శించారు. అక్కడ వివిధ పనులకు వచ్చిన దరఖాస్తు దారులతో ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం లో సేవలు గురించి తెలుసుకున్నారు. అనంతరం రవాణా శాఖ అధికారులతో స్కూల్ బస్సుల ఫిట్ నెస్ జారీ, తనిఖీలు,కేసుల వివరాలు సమీక్షించి తనిఖీలు నిర్వహించాలని, ఫిట్ నెస్ లేని వాహనాలపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఎం.కిషన్,అర్‌టిఓ రఘు కుమార్,ఎంవిఐ వాసుదేవ రావు తదితరులు ఉన్నారు .

# తిరుమల రావు అరెస్టు...



తిరుమల రావు ఫైల్

**గద్వాల టౌన్, జూన్ 25, ప్రభాతవార్త:** సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు అయిన తిరుమ ల రావును గద్వాల పోలీసులు అరెస్ట్ చేశారు. తేజేశ్వర్ మిస్సింగ్ అయిన మొదటి రోజు నుండే కేసును ఛాలెంజ్ గా తీసుకున్న పోలీసులు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టి పురోగతి సాధించారు.మూడు రోజుల్లోనే పూర్తి సమాచారం సేకరించిన పోలీసుల పనితీరుపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.హైదరాబాద్ విమానాశ్రయంలో విదేశాలకు పారిపోతూ ప్రధాన నిందితుడు పట్టుబడినట్లు సమాచారం. ఇప్పటికే ఈ హత్య కేసులో 8మంది అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు సుపారీ గ్యాంగ్ తో తెల్లవారుజామున రికన్స్ట్రక్షన్ చేసి ప్రధాన నిందితుడు అయిన తిరుమల రావును అరెస్ట్ చేశారు. త్వరలో జోగులాంబ గద్వాల జిల్లా పోలీసులు మీడియా సమావేశంలో నిందుతులను ప్రవేశ పెట్టి పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం వున్నట్లు తెలుస్తుంది.

### కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌పై

# ఏసీబీ దాడులు...

- ఏసీబీ వలలో కల్వకుర్తి 2వ ఎస్ఐ
- 10వేల లంచం తీసుకుంటు పట్టుబడిన 2వ ఎస్ఐ



ఏసీబీ వలలో 2వ ఎస్ఐ రాంచందర్‌జీ

**కల్వకుర్తి, జూన్ 25 ప్రభాతవార్త:** అవినీతిని నిర్మూలించి అక్రమార్జనకు పాల్పడుతున్న అధికారులపై ఏసీబీ అధికారుల డేగా కన్ను పెట్టిన కూడా అవినీతి అధికారులు మాత్రం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ఏసీబీ అధికారులు అవినీతికి పాల్పడుతున్న అధికారుల భరతం పడుతున్న అవినీతికి పాల్పడుతున్న అధికారుల్లో మాత్రం చలనం కలగడం లేదు. అమాయకమైన ప్రజలను భయ బ్రాంతులకు గురి చేసి

– మిగతా4లో..

# యువత యాంటీ డ్రగ్స్ సోల్జర్స్‌గా పనిచేయాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

**నారాయణపేట టౌన్,జూన్25 ప్రభాతవార్త :** నేటి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వాడకాన్ని నిర్మూలించి భావితరాలకు బంగారు బాటలు వేసేందుకు యాంటీ డ్రగ్స్ సోల్జర్స్ గా పనిచేయాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, స్థానికసంస్థల అదనపుకలెక్టర్ సంచిత్ గంగ్వర్ అన్నారు.డ్రగ్స్ రహితసమాజాన్ని నిర్మించేందుకు అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని ముఖ్యంగా యువత భాగస్వామ్యం ఎంతో అవసర మని వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలలో భాగంగా బుధవారం డీడబ్ల్యుఓ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో కలెక్టరేట్,పోలీస్, ప్రెస్,డీ.డబ్ల్యు.ఓ మొత్తం నాలుగు జట్లు పాల్గొన్నాయి.ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పీ, అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వారు సూచించారు. అనంతరం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా కలెక్టరేట్ పోలీస్ టీంల మధ్య ప్రారంభ మ్యాచ్‌ను ఎస్పీ, అదనపు కలెక్టర్ టాస్ వేసి ప్రారంభించారు. మొదట బ్యాటింగ్ చేసిన పోలీసు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 91 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. 92 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కలెక్టరేట్ జట్టు 7 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఆ తర్వాత ప్రెస్, డీడబ్ల్యుఓ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ప్రెస్ టీమ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఏకంగా 148 పరుగుల భారీ లక్ష్యాన్ని విధించగా, డీడబ్ల్యుఓ జట్టు కేవలం 76 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. చివరగా మొదటి మ్యాచ్‌లో గెలిచిన పోలీస్ జట్టు, రెండో మ్యాచ్‌లో గెలిచిన ప్రెస్ జట్టు తుది పోరులో తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ప్రెస్ జట్టు పది ఓవర్లలో 49 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని పోలీస్ జట్టు ముందు ఉంచింది. అయితే పోలీస్ జట్టు 5ఓవర్లలో కేవలం మూడు వికెట్లు కోల్పోయి విజయాన్ని సొంతం చేసుకుంది. గెలుపొందిన విన్నర్, రన్నర్ జట్లకు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డిపిఆర్‌ఓ ఎం.ఏ. రషీద్ కప్‌లను అందజేసి ఇరు జట్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి నల్లపు లింగయ్య, ఆర్ఐ నరసింహ, డివైఎస్ఓ వెంకటేష్, స్థానిక ఎస్.ఐ. వెంకటేశ్వర్లు, కలెక్టరేట్, పోలీసు, డిడబ్ల్యుఓ, మీడియా మిత్రులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## నల్లమల వాసికి తెలంగాణ గౌరవ్ సామ్మాన్ అవార్డు



గౌరవ్ సామ్మన్ అవార్డు అందుకున్న మేడమోని మల్లేష్

**ఉప్పునుంతల, జూన్ 25 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో నల్లమల్ల ప్రాంతంలోని అచ్చంపేట తాలుడ లోని ఉప్పునుంతల వాసి మేడమోని మల్లేష్‌కు ప్రపంచ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ గౌరవ్ సామ్మన్ అవార్డు అందుకున్నారు. వ్యక్తిగత ప్రేరణాత్మక వక్త మేడమోని మల్లేష్ ఉత్తేజ కరమైన వ్యక్తిగత ప్రేరణాత్మక వక్త. అతని మాటల ద్వారా జీవితాలను మార్చడమే కాదు, వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధి వైపు ప్రజలను మార్గ నిర్దేశం చేయాలని లోతైన మక్కువతో తెలంగాణ అంతటా చాలామందికి ఆశ దారి చూపేవాడు. అతని ప్రేరణాత్మక సెషన్లు లెక్కలేనన్ని జీవితాలను తాకింది. విశ్వాసం, స్థితి స్థాపకత ప్రయోజనాన్ని కలిగిస్తాయి. అంకితభావం, తాదాత్మ్యం, శక్తివంతమైన స్వరం ద్వారా అతను సమాజంలో సానుకూల మార్పును ప్రభావితం చేస్తూనే ఉంటాడు. విజయం వైపు వ్యక్తులను ప్రేరేపించడానికి అతని అత్యుత్తమ సేవ, నిబద్ధతక గుర్తింపుగా మేడమోని మల్లేష్‌ను వరల్డ్ ఛారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా తెలంగాణ గౌరవ్ సామ్మన్ అవార్డుతో ఘనంగా సత్కరించారు.

## కొండలు కరిగిపోతున్న పట్టించుకోని అధికారులు


మొరం తరలిస్తున్న దృశ్యం

**మద్దూర్, జూన్ 25 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామ సమీపంలో మొరం అక్రమంగా టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్న సంబంధిత శాఖ అధికారులు చూసి చూడనట్లుగా వెళ్లిపోతున్నారని పలువురు అంటున్నారు. ప్రతిరోజు ఎటువంటి పరిమిషన్ లేకుండా రవాణా జరుగుతున్న ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. కొంతమంది దళారులు కిందిస్థాయి సిబ్బంది ద్వారా ఆ మ్యామ్యాలు ముట్ట చెప్పినట్లు విశ్వాసనీయ సమాచారం ద్వారా తెలిసింది. రాత్రిపూట కొంతమంది కిందిస్థాయి సిబ్బంది సహకారంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా ఈ వ్యాపారం కొనసాగుతుంది. జిల్లా అధికారులు ఈ విషయంపై స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పతాన్ని అలవార్చుకోవాలి

**విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షుడు ఆదంరాజు**



అరచేతిలో మంటలు పుట్టిస్తున్నా అధం రాజు

**పెబ్బేరు,జూన్25 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం యాపర్ల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పటు చేసిన సైన్స్, మూఢనమ్మకాలు, వైజ్ఞానిక దృక్పథం విశ్వంతరాలను పరిశోధిస్తున్న సైంటిఫిక్ టెంపర్ గురించి విద్యార్థులకు, విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షులు బొల్లి ఆదామ్ రాజ్, వివరిస్తూ, అలాగే ఈ సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢ విశ్వాసాలను అంతం చేయాలని మూఢ విశ్వాసాలతో మనుషులు మానసిక రోగులుగా తయారయి వారు ఏం చేస్తారో తెలియని పద్ధతిలో సొంత బిడ్డలనే చంపుకునే స్థితిలోకి వెళ్లారు. దీని అరికట్టాలి అంతం చేయాలి మూఢనమ్మకాలు వట్టి వ్యర్థం బూటకం మంత్రాలు చేతబడి భానుమతి అనేటివి అన్నీ ఒకబూటకం వారి స్వార్థలాభాల కోసం సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. సమా జమా ఇలాంటివి నమ్మకండి సైన్స్ దృక్పదంతో ఆలోచన చెయ్యండి. ఈకార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పలుస శంకర్‌గౌడ్, గ్రామస్తులు నరేందర్‌రెడ్డి, స్వరాజ్యం బాబు రెడ్డి, భీముడు, శ్యామ్, దామోదర్, శివారెడ్డి, ఉపాధ్యాయులు మొహినొద్దీన్, వెంకటేశ్వర్లు, ఈశ్వర్ రెడ్డి, ఇందిరమ్మ, రమేష్, ఆంజనేయులు, శివాని తల్లిదండ్రులు విజ్ఞానదర్శిని వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం ప్రశాంత్ సభ్యులు వినోద్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి :ఎంఈఓ



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

**దేవరకద్ర, జూన్ 25 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గోపన్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం దేవరకద్ర ఎంఈఓ బలరాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను మరియు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని, ప్రతి విద్యార్థికి చదవడం రాయడం వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనదని అన్నారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని ఎంఈఓ బలరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అబ్దుల్ హక్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**శ్రీరంగాపూర్, 25 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల్ వెంకటాపూర్ గ్రామ చౌరస్తా నందు సైబర్ నేరాలపై గ్రామం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని శ్రీరంగాపూర్ ఎస్సై రామకృష్ణ సిబ్బంది తో నిర్వహించడం జరిగింది. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరిగింది. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు1930 టోల్ ఫ్రీ నెంబర్ దయల్ చేసి సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా అందుకు నిర్ధారించిన వెబ్ సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్.జిఓవి.ఇన్ సందర్శించవచ్చు అన్నారు. ఫోన్లో ఓటిపి, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్డేట్ చేయమని వచ్చే మెసేజ్ లను సందర్శించకూడదన్నారు. ప్రస్తుతం రోజురోజుకు పెరుగుతున్న ఆన్ లైన్ మోసాలు, సైబర్ నేరగాల పట్ల అవగాహన కలిగి ఉండి బంధువులకు, స్నేహితులకు ప్రజలకు వివరించాలన్నారు. సెల్ ఫోన్‌లో వచ్చే లోన్ యాప్‌లా జోలికి పోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు లోనైనా బాధితులు వెంటనే పోలీస్ వారికి సంబంధిత వివరాలు అందిస్తే సంబంధిత అకౌంట్లను బ్లాక్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, సిబ్బంది పాల్గొనడం జరిగింది.

25ఎంబిఎన్ఆర్ 13: మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

## అర్హులకే ఓటరు నమోదు కల్పించాలి

**బిజినేపల్లి, జూన్ 25 ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన అర్హులకే ఓటరు నమోదు కల్పించాలని తహసీల్దార్ మునీరుద్దీన్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్ వోలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలను తొలగించడంతో పాటు తప్పులను సరి చేయడం, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఓటహక్కును మార్చిడికి సంబందిత ఫారాలను అభ్యర్థుల నుంచి రాతపూర్వకంగా తీసుకొని మార్పులు, చేర్పులు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ చిక్కుడు రవికుమార్, ఎంఆర్ఐ బాలరాజు, సీనియర్ అసిస్టెంట్ భారతిబాయి, రికార్డు అసిస్టెంట్ భగవంత్ సాగర్, ఆయా గ్రామాల బీఎల్‌వోలు ఉన్నారు.

## యువత మత్తుకు బానిస కావొద్దు..

**- విద్యార్థులకు వ్యాసరచన పోటీలు.. - కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి**


విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూన్ 25 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవ బృందం ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో అంతర్జాతీయ మత్తు పదార్థాల నిషేధ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్, మద్యం వల్ల కలిగే నష్టలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అవగహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ యువత చిన్న వయస్సులోనే మత్తు పదార్థాలు, మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, అలాకాకుండా చదువుపై ద్యాస పెట్టి ముందుకు సాగాలని కోరారు. అలాగే డ్రగ్స్ వాడకం పట్ల చట్ట రీత్యా నేరమని, అందుకు జైలు శిక్షలు పడాల్సి ఉంటుందని విద్యార్థులకు చెప్పారు. అనంతరం వ్యాసరచన పోటిల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. కార్యక్రమంలో సేవా బృందం అధ్యక్షుడు శివ కుమార్, పాఠశాల ప్రధానచార్యులు రాజు, సేవా బృందం సభ్యులు హర్షిత్, లక్ష్మినరసింహ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే

ఎఐసిసి కార్యదర్శి డా. ఎస్.ఏ సంపత్ కుమార్

**వడ్డేపల్లి, జూన్ 25 ప్రభాతవార్త :** అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఎఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో అలంపూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. హాజరైన ఎఐసిసి కార్యదర్శి మాజీ ఎంపీ విశ్వనాథ్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, వెంకటేష్ వారికి ఘన స్వాగతం పలికారు. జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శాంతి నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్ మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని ఎన్నికల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం కోసం కృషి చేసిన వారికి ఏళ్ల వేళల అండగా ఉంటానని రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, వాటిని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకున్న ప్రతి గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. ఏది ఏమైనప్పటికీ గ్రామాల పట్టణాల అభివృద్ధి కోసం ఇతర పార్టీలో ఉన్న నాయకులు కార్యకర్తలు సైతం కాంగ్రెస్ పార్టీ గెలుపులో భాగస్వామ్యం కావాలని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ సంపత్ కుమార్ లాంటి నాయకుడు అలంపూర్ ప్రజలకు దొరకడం దేవుడు యిచ్చిన వరం అని సంపత్ కుమార్ గెలిచిన ఓడినా ప్రజల్లో ఉండే వ్యక్తి అని దేశ వ్యాప్తంగా మంచి వాక్చాతుర్యం కలిగిన వ్యక్తి అని అంతేకాకుండా త్వరలోనే గద్వాల జిల్లా అలంపూర్ నియోజగ వర్గ ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి నోటి వెంట శుభవార్తను వినబోతున్నారు అని కూడా అన్నారు. సంపత్ కుమార్ యంగ్ అండ్ డైనమిక్ విజనరి లీడర్ అనీ గెలిపించుకోలేకపోయిన దురదృష్టవంతులు అలంపూర్ ప్రజలు అని గెలిచి ఉంటే తప్పక మంత్రి హోదాలో అలంపూర్ నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేసేవారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ అబ్జర్వర్ దీపక్ జాన్, వెంకటేష్, గ్రంథాలయ ఛైర్మన్ నీలి శ్రీనివాస్, మార్కెట్ కమిటి ఛైర్మెన్ దొడ్డప్ప వైస్ ఛైర్మెన్ కుమార్, ఆర్టిఏ కమిషన్ నెంబర్ పల్లీ సతీష్ రెడ్డి, మాజీ ఆర్డీఎస్ ఛైర్మెన్ సీతారామ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు కొంకల నాగరాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వడ్డేపల్లి దేవేంద్ర, మహిళ జిల్లా అధ్యక్షురాలు నాగాశిరోమణి, అన్ని మండలాల అధ్యక్షులు పదాధికారులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మంత్రి ఆదేశాలతో ఆత్మకూర్ అభివృద్ధి వేగవంతం


అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న కాంగ్రెస్ నాయకులు

**ఆత్మకూర్ జూన్ 25, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రస్తుత శాఖ మంత్రివర్యులు మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిలి శ్రీహరి ఆదేశాలతో ఆత్మకూరు అభివృద్ధిని వేగవంతం చేయనున్నట్లుగా ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ ఆత్మకూర్ పట్టణ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు తదితరులు వెల్లడించారు. ఈ మేరకు వారు బుధవారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూర్ మండలం నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మూడు ముక్కలు కావడంతో ఇక్కడి అభివృద్ధి అక్కడే ఆగిపోయిందని రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణమే స్పందించి పట్టణానికి మంత్రి సొంత నిధులతో 10 కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టం ఉన్నట్లుగా వారు తెలిపారు పట్టణంలోని పది వార్డులకు గాను ఒక్కో వార్డుకు కోటి రూపాయల చొప్పున ఆయా అవార్డుల్లో మురుగు కాలువల నిర్మాణం మరియు సిసి రోడ్ల కోసం తక్షణమే ప్రణాళికలు రూపొందించి పనులు చేపట్టనున్నట్లుగా వారు తెలిపారు అంతేకాకుండా ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని డయాలసిస్ రోగులు ఇబ్బందులకు గురికాకుండా తక్షణమే మంత్రిగారు స్పందించి ఆత్మకూర్ పట్టణంలో డయాలసిస్ కేంద్రం పనులు వేగంగా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు మంత్రి ఆదేశాలతో ఆత్మకూర్ పట్టణ అభివృద్ధిని విపురేఖలు మార్చడమే కాకుండా పట్టణ సమీపంలోని పరమేశ్వర స్వామి చెరువు కట్ట విస్తీర్ణానికి ప్రతిపాదనలు పంపించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లుగా వారు తెలిపారు మంత్రి వాకిటి శ్రీహరి 10 కోట్ల నిధులను విడుదల చేయాలంటూ అధికారులను ఆదేశించడంతో పట్టణంలోని ఆయా అవార్డుల్లో అభివృద్ధి పనులు గుర్తించి అధికారులకు ప్రతిపాదనలు అందజేసేందుకు రూపకల్పన చేస్తున్నట్లుగా వారు తెలిపారు బుధవారం రోజు పట్టణంలోని ఒక్కో వార్డులో ఆ వార్డులకు ఇన్చార్జిగా ఉన్నటువంటి కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు గుర్తించినట్లుగా వారు తెలిపారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు


తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

**మానవపాడు, జూన్ 25 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల శివారులో ఉన్న ఆంజనేయ స్వామి ( సప్రమయ్య)గుడి వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరపడం కలకలం రేపింది. ప్రతి అమావాస్యకు ఇక్కడ వెలిసిన ఆంజనేయస్వామికి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. గుట్టు చప్పుడు కాకుండా కొందరు దుండగులు గుప్త నిధుల కోసం గుడి ఆవరణలో తూర్పు వైపున నాలుగు అడుగుల మేరకు తవ్వకాలు జరిపారు. బుధవారం అమావాస్య కావడంతో పూజల కోసం వచ్చిన భక్తులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్ఐ అంజని రావు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సీపీఐ మండల కార్యదర్శిగా కృష్ణాజీ

**బిజినేపల్లి, జూన్ 25 ప్రభాతవార్త :** కార్మిక, కర్షకుల హక్కుల కోసం నిరంతయం పోరాటం చేసే సీపీఐ మండల కార్యదర్శిగా రెండోసారి పి. కృష్ణాజీ నియమించినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్ నరసింహ బుధవారం తెలిపారు. సీపీఐ పార్టీ మండలంలోని ఆయా గ్రామాల్లో బలోపేతం చేయడంలో విశేషంగా కృషి చేసిన కృష్ణాజీని కార్యకర్తల సూచన మేరకు ఏకగ్రీవంగా మరోసారి నియమించినట్లు ఆయన తెలిపారు. మండల కార్యదర్శిగా రెండోసారి నియామకమైన కృష్ణాజీని జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈర్ల చంద్రమోళి, ఈర్ల భూషేష్, కృష్ణారెడ్డి, ఎం.శ్రీనివాసులు తదితరులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

## రేపు ముఖ్య కార్యకర్తల సమావేశం

**ఉప్పునుంతల, జూన్ 25 ప్రభాతవార్త :** ఉప్పునుంతల మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం రేపు శుక్రవారం ఉదయం 10 గం.లకు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి తెలిపారు. ఈ సమావేశం బల్మూరు మండలం జినుకుంట కనకాల మైసమ్మ సమీపంలో ఉన్న బిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని, టిపీసీసీ ఉపాధ్యక్షులు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు, మండల స్థాయి నాయకులు విధిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

# విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకూడదు

**డ్రగ్స్ వాడడం వల్ల జరిగే నష్టంపై విద్యార్థులకు అవగాహన**


ఉప్పునుంతల హైస్కూల్‌లో డ్రగ్స్ నివారణపై గోడపత్రిక విడుదల

**ఉప్పునుంతల, జూన్ 25 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం ఆ పాఠశాల హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ వాడడం వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో అవగాహన కల్పించారు. అంతకుముందు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పాఠశాలలో విద్యను అభ్యసించే సమయంలో చెడు మార్గాలకు వెళ్లకూడదని, చెడు మార్గాలకు వెళ్లడంతో జీవితాంతం నష్టపోవాల్సి వస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నిర్బంధ విద్యను సద్వినియోగ పరుచుకొని మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని విద్యార్థులను కోరారు. విద్యార్థి దశలో తప్పుడు మార్గాలు ఎంచుకుంటే తమతో పాటు తమ కుటుంబాలు వీధిన పడతాయని, చదువులో అందరికన్నా అత్యధికంగా మార్కులు సాధించాలని లక్ష్యంతో విద్యార్థులు చదువుకొని మంచి భవిష్యత్తు ఎంచుకోవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థి దశలో మంచిగా చదువుకొని ఉద్యోగాలు సాధించాలని ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో ఎస్సై వెంకట్ రెడ్డితో పాటు పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీధర్, శ్యాంసుందర్ గౌడ్, అజ్మతుల్లా, రాజావర్ధన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఇంతియాజ్, మల్లేష్, రేణుక, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో డ్రగ్స్ నివారణపై గోడ పత్రికలను విడుదల చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం..

**దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి**


అంజిల్ రెడ్డి

**దేవరకద్ర,జూన్25 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమంతో పాటు పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. 6 గ్యారంటీలను అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలోని రైతంగానికి సాగునీరు అందించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్లి స్థానిక సంస్థలఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి అన్నారు.

# గోపన్ పల్లిలో లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం


విద్యార్థుల స్థాయి నిర్ధారణ పరీక్షలను,పరిశీలిస్తున్న ఎంఈఓ

**దేవరకద్ర,జూన్25 ప్రభాతవార్త:** సర్కారు బడుల విద్యార్థుల కోసం లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం (ఎల్ఐపి) ను ఆగస్టులో ప్రారంభిం చాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకుగాను బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోపన్ పల్లి గ్రామంలో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు స్థాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. దేవరకద్ర ఎంఈఓ బలరాం గోపన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బల రాం, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హక్ మాట్లాడుతూ విద్యార్థులు కనీస సామర్థ్యాల సాధించడమే ఈ ప్రోగ్రామ్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ ఏడాది ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యా ర్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాంకు విద్యాశాఖ రూపకల్పన చేసింది. ఏం చదివారో, ఏం నేర్చుకున్నారో, చెప్పలేని పరిస్థితుల నుంచి విద్యార్థులను గట్టెక్కించేందుకు ఈ ప్రోగ్రాంకు విద్యాశాఖ శ్రీకారం చుట్టిందన్నారు. ఈ స్థాయి నిర్ధారణ పరీక్షలు ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించి, మూల్యాంకనం చేసి, వచ్చే నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్ చేయాలన్నారు. అదేవిధంగా రెండో తరగతి నుంచి ఐదో తరగతి వరకు జాతీయ విద్యా విధానంలో ప్రాథమిక అక్షరాస్యత, ఎఫ్ఎల్ఎన్ అనేది పిల్లల ప్రారంభ సంవత్సరంలో సమగ్ర పెరుగుదల, అభివృద్ధి కోసం ఒక విద్యా చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం పిల్లలు వాతావరణాన్ని బాగా అర్థం చేసుకోవడానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించి, పెండింగ్ కేసులను తగ్గించాలి



రివార్డులు అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట, జూన్ 25 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు అధికారులతో బుధవారం నెలవారి నేర సమీక్షా సమావేశంలో నిర్వహించి జిల్లా పరిధిలో నేరాల నియంత్రణ పై దృష్టి సారించి, పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలి అన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి అన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ప్రతి అధికారికి సి.సి.టి.యన్.ఎస్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంవర్ధవంతమైన సేవలు అందజేస్తు సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. గ్రామ పోలీసు అధికారులు ప్రతీ రోజు గ్రామానికి సందర్శించి ప్రజలతో మమేకం అవుతూ నేర నియంత్రణకు కృషి చేయాలని అన్నారు. కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజల కు అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్లైన్ మోసాలకు గురి అయినట్లైతే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. మాదకద్రవ్యాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృ ష్టి సారించాలని, ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లు గా గుర్తించి, సైన్ బోర్డు లను ఏర్పాటు చేయించాలని సూచించారు. హైవే రోడ్లను కలుపుతూ ఉండే లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్స్ వేయించడం, రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలిగించే విధంగా చూడాలని అన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ లో లోపాలున్నట్లయితే నేషనల్ హైవే స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రమాదాల నివారణ కృషి చేయాలని అన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు గంజాయిని ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా క్రయ విక్రయాల పైన, జూదం, పి.డి.యస్ అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రిపీటెడ్ గా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ ను నమోదు చేయాలని సూచించారు.

## కమిషనర్‌ను సన్మానించిన రెడ్డి సేవా సమితి సభ్యులు



కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సేవా సమితి సభ్యులు

**మహబూబ్‌నగర్, జూన్25, ప్రభాతవార్త:** మహబూబునగర్ మునిసిపల్ కమిషనర్ గా బాధ్యతలు తీసుకున్న టి. ప్రవీణ్ కుమార్ రెడ్డిని పాలమూరు రెడ్డిసేవా సమితి సభ్యులు కలిశారు. ఈ మేరకు బుధవారంమహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో కలిసి సన్మానించారు. కార్య క్రమంలో పాలమూరురెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనా రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, కోశాధికారి మల్లు నర్సింహారెడ్డి, సహ అధ్యక్షుడు ధనంజయ్ రెడ్డి, ప్రచార కార్యదర్శి నల్లమద్ది సురేందర్ రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్‌రెడ్డి మరియు సభ్యులు పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## 29న సాయిచంద్ విగ్రహావిష్కరణ

### - పోస్టర్‌ను ఆవిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్, నాయకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, నాయకులు

**జడ్చర్ల, జూన్ 25,ప్రభాతవార్త:** కళాకారుడు,గాయకుడు,రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ స్వర్గీయ వేద సాయి చంద్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఆయన స్వంత గ్రామం వనపర్తి జిల్లా అమంచింతలో ఈనెల 29న నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం జడ్చర్లలో బిఆర్ఎస్ పార్టీ మండల,పట్టణ నాయకులు ఆవిష్కరించారు. జడ్చర్ల పురపాలిక చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, సింగిల్ విండో చైర్మన్ సుదర్శన్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులుపిట్టలమురళి, నాయకులు శ్రీశైలంయాదవ్, ప్రనిల్‌చందర్, కోనేటి నరసింహులు,యూత్ వింగ్ నాయకులు వీరేష్,సుప్ప ప్రకాష్, బంగారి వెంకటేష్, కౌన్సిలర్లు, కోట్ల ప్రశాంత్ రెడ్డి, సతీష్, కరాటే శ్రీను, కార్యదర్శి నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ నేత టీఎంగౌడ్ జన్మదిన వేడుకలు



టీఎంగౌడ్ జన్మదినం సందర్భంగా పూలమాలలు,శాలువలతో సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు

**భూత్పూర్,జూన్ 25,ప్రభాతవార్త:** భూత్పూర్ మండల బీఆర్ఎస్ సీనియర్ నేత టి మురళీధర్‌గౌడ (టీఎంగౌడ్)56వ జన్మదిన వేడుకలు భూత్పూర్‌లో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు భూత్పూర్ చౌరస్తాలో పెద్దఎత్తున సంబరాలు జరిపారు.కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.బాణాసంచా పేల్చి తమ ఆనందాల్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డితో పాటు నాయకులు మనెమోనిసత్యనారాయణ,సత్తూర్ నారాయణగౌడ్,మేకల సత్యనారాయణ,తూము శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి నరేష్‌గౌడ్,మొహ్మద్ సాధిక్,మొహ్మద్ ఆహ్మద్,మొహ్మద్ యాసిన్,మొహ్మద్ షాకీర్,రాచూరి చంద్రమౌళి,మొల్గర నర్సింహులుగౌడ్,మూష బాలస్వామి,గడ్డం ప్రేమక్‌కుమార్, గడ్డం రాములు,సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్,మూష సాయిలు,సత్తూర్ వెంకటేష్‌గౌడ్,పులగుర్ల మల్లేష్, ఆగిరి సత్యం,గడ్డంయాదయ్య,రామకృష్ణ,సత్తూర్ సురేష్‌గౌడ్,సత్తూర్ అశోక్‌గౌడ్,సత్తూర్ రాకేష్ గౌడ్, సత్తూర్ తిరుపతయ్యగౌడ్,గొడుగు వెంకటరాజు,మాల విఠల్‌దాస్ వెంకటేష్,మండి ఆటో వెంకటయ్య తదితరులు పాల్గొని తమ నేత టీఎంగౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.వీరితో పాటు భూత్పూర్ మీడియా ప్రతినిధులు టీయుడబ్లుజె(ఐజెయు)భూత్పూర్ మండల శాఖ అధ్యక్షుడు గొడుగువెంకటయ్య,ప్రధాన కార్యదర్శి అర్వ విజయ్‌కుమార్,కోశాధికారి మూడావత్ శంకర్‌నాయక్ తో పాటు టియుడబ్లుజె-143 సంఘం భూత్పూర్ శాఖ అధ్యక్షుడు రాసన్ యాదగిరి తదితరులు బీఆర్ఎస్ నేత టీఎంగౌడ్‌ను స్వయంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పాఠశాలకు టివి వితరణ



పాఠశాలకు టివి వితరణ చేస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్, జూన్25 ప్రభాత వార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని కంబలాపూర్ యుపిఎస్ స్కూల్‌నందు ఉపాధ్యా యునిగా పనిచేస్తున్న పి.శివశంకర్ సొంతం గా తాను పనిచేస్తున్న పాఠశాలకు టీవీని వితరణ చేయడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ టీవీ ద్వారా పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన విద్యా కార్యక్ర మాలను, చూపించడం ద్వారా వారి జ్ఞానాన్ని పెంచడానికి సహాయపడుతుందని, టీవీలో కలలు, సంస్కృతి, చరిత్రకు సంబంధించిన కార్యక్రమాలు పిల్లలు మరింత అవగాహన చేసుకోవడానికి సహాయపడుతుందని తెలియజేయడం జరిగింది.పాఠశాలకు టీవీని వితరణ చేసినందుకు ఉపాధ్యా యుడైన శివశంకర్‌ను సహ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు అభినందించ డం జరిగింది. పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేయడం జరిగింది.

## బికేఎస్ ఆధ్వర్యంలో మట్టెద్దుల పూజలు

**దామరగిద్ద, జూన్ 25 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం క్యాతన్ పల్లి గ్రామంలో మట్టెద్దుల అమావాస్య పురస్కరించుకొని క్యాతంపల్లి వీరభద్రేశ్వర స్వామి దేవాలయం నందు ఉపాధ్య క్షులు శరణయ్య స్వామి మట్టేదుల పూజ నిర్వహించారు. రైతులు పంటలు మంచిగా పండాలని ఈ సంవత్సరం పంటల దిగుబడి అధిక రావాలని సకాలంలో వర్షాలు పడి అధిక పంటలు పండాలి. భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశంలో గత 15 రోజుల నుండి వర్షాలు రాక ఇబ్బంది పడుతున్న సందర్భంగా పొలాల్లో మొక్కలు వాడుదశకు రావడం జరుగుతుంది కాబట్టి వారందరూ వర్షం కొరకు ఎదురుచూస్తున్న సందర్భంగా భగవంతుడు ఈ ప్రాంతానికి వర్షం ఇవ్వాలని కోరుతున్నారు అదేవిధంగా ఈ ప్రాంతంలో ఎవరికైనా రైతు భరోసా డబ్బులు రానీయడల సంఘానికి సంబంధించిన గ్రామ అధ్యక్షులు మండల అధ్యక్షులు మండల కార్యవర్గం జిల్లా కార్యవర్గానికి ఫిర్యాదు చేసి మీ పేర్లు నమోదు చేయిస్తే ప్రభుత్వం ద్వారా రైతు భరోసా రాని అభ్యర్థుల పేర్లను ప్రభుత్వానికి వ్యవసాయ అధికారులకు దృష్టికి తీసుకుపోయి న్యాయం చేస్తామని తెలియపరచడం జరిగింది. పాల్గొన్న వారిలో రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా, నారాయణపేట జిల్లా మాజీ ఉపఅధ్యక్షులు బాలచందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి రంగారెడ్డి, సహాయ కార్యదర్శి మల్లికార్జున్, దామరగిద్ద మండల అధ్యక్షుడు మద్దెలబిడుపు సుభాష్, ఉపాధ్యక్షుడు మొగల్ మడక రాజు ఉట్కూరు మండలం పగిడిమారి గ్రామ అధ్యక్షుడు మన్నె నాగార్జున, దామరగిద్ద హరీష్ ఇతర రైతులు భాగస్వాములు కావడం జరిగింది.

## రుచికరమైన భోజనం అందించాలి

**నారాయణ పేట, జూన్ 25 ప్రభాతవార్త :** నారాయణ పేట మండలం పరిధిలోని బుధవారం జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా మధ్యాహ్న భోజన పథకం ఇంచార్జ్ అధికారి యాదయ్యశెట్టి సీఎంఓ రాజేంద్రకుమార్ ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని వంటగది శుభ్రంగా ఉంచుకోవాలని బియ్యాన్ని రెండు మూడు సార్లు శుభ్రం చేసి వంట చేయాలని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా నిర్వాహకులకు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సీఎంఓ రాజేందర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరము ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా చేరారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి. భాను ప్రకాష్, మధుసూదన్ రావు, రఘురాం రెడ్డి, వంట నిర్వాహకులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేస్తాయి
- జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్పీ , సిబ్బంది

**బిజినేపల్లి, జూన్ 25 ప్రభాతవార్త:** డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని, మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ సూచించారు. పాలెం వ్యవసాయ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ హాజరై మాట్లాడారు.డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.మాదక ద్రవ్యాలతో జరిగే నష్టాలను వివరించారు. చదువుకునే వయసులో యువత చెడు వ్యసనాలకు గురి కాకుండా క్రమ శిక్షణతో మంచి ఆశయాలతో భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు.యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్య త్తును నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలు మనుషుల ఆరోగ్యాలను నిర్వీర్యం చేస్తున్నాయని ఎంతోమంది జీవితాలు మధ్యంతరంగా ముగిసిపోతున్నాయన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడడం వలన క్రమేపి ఆరోగ్యం క్షీణించడంతో పాటు అది ఒక వ్యసనంగా మారుతుందని, నేర ప్రవృత్తి వైపుదారి తీస్తుందన్న విషయం గమనించాలని పేర్కొన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ సమాచారం తెలిస్తే పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వ్యవసాయ కళాశాల డీన్‌డాక్టర్ పుష్పావతి మాట్లాడుతూ సమాజానికి పట్టిన చీడపురుగు లాంటి డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సి న అవసరం ఎంతో ఉన్నదన్నారు. కొంతమంది మత్తుకు బానిసలై కొంత కాలానికి తీవ్ర మానసిక సంఘర్షణలతో ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులంతా డ్రగ్స్‌రహిత సమాజంతమ బాధ్యతగా భావించాలన్నారు. మత్తు పదార్థాల బారిన పడడంతో యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని యువతీ, యువకులు వాటికి దూరంగా ఉండాలన్నారు.అవగాహన సదస్సులో మాదకద్రవ్యాల నిర్మూలనపై పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐ కనకయ్య ఎస్ఐ కే శ్రీనివాస్, శాస్త్రవేత్తలు డా. శశి భూషణ్,ఈటల సత్యనారాయణ,సిబ్బంది బాల నరసింహులు, శ్రీనివాస్ గౌడ్, జలాల్, నారాయణ, రూప్ సింగ్, శివ, అంజి, రవి,జితేందర్ మంజుల, అంకిత, రవీందర్ పాల్గొన్నారు.

## రైతు సుభిక్షమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### - తెలంగాణ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

**భూత్పూర్,జూన్ 25,ప్రభాతవార్త :** రాష్ట్రంలో రైతుల సుభిక్షమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొమ్మిది రోజుల్లో రైతు భరోసా కింద రు.9వేల కోట్ల నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేసినందున రైతులు,ఎమ్మెల్యే జీఎంఆర్ ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి భూత్పూర్ పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారి -44 కూడలిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలలో బానాసంచాలు పేల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రైతులనుద్దేశించి చైర్మన్ అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ తమది రైతుల ప్రభుత్వమని పేర్కొన్నారు.రైతుల సంక్షేమం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్తశుద్ధితో ఉన్నారన్నారు.

- హరీశ్‌రావు మతితప్పి మాట్లాడుతున్నాడు : దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)

రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 17నెలల్లో పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) అన్నారు.ఎన్నికల ముందు తమ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు.తమది రైతుల ప్రభుత్వమని,రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో కోటి49లక్షల39వేల 111ఎకరాలకు రు.9వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమచేశామని పేర్కొన్నారు. సన్నాలకు ఇదివరకు ప్రకటించినరు.500ల బోనస్‌ను ఇస్తున్నట్లు తెలిపారు.రైతులకు సకాలంలో విత్తనాలు,ఎరువులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.తమ ఏడాదిన్నర కాలపాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.కళ్లముందు ఇన్ని సంక్షేమ పథకాలు అమలౌవుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తమ ప్రభుత్వంపైమతితప్పి మాట్లాడుతూ బురదజల్లే ప్రయ త్నం చేస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్య క్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎంపీపీ కదిరే శేఖర్‌రెడ్డిలతో పాటు మండల యువజనకాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావులపల్లి మొల్గర నర్సింహులు,మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియానాయక్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మొల్గర నర్సింహ్మారెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్‌లతో పాటు నాయకులు గోవర్ధన్‌గౌడ్,బోరింగ్ నర్సింహులు,గడ్డం ఎల్లప్ప, తాటికొండ రవీందర్‌రెడ్డి, వడ్డె శ్రీనివాసులు, వెంకటేష్, రాంరెడ్డి, కిట్టురెడ్డి,మాసగౌడ్,టీవీరెడ్డి,మునిస్వామి,బజారు పరుశురాం,పవన్,శివరాములు,కొండన్న,సంజీవరెడ్డి,కోట్ల కిష్టయ్య,మంగలి వెంకటనారాయణ,అఫ్రోస్,జమీర్ తదితరులు పాల్గొన్నారు.సీడ్స్ కార్పొరేషన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారి భూత్పూర్‌కు విచ్చేసిన అన్వేష్‌రెడ్డిని ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## 27 నుండి పాలిసెట్ కౌన్సిలింగ్

**బిజినేపల్లి, జూన్ 25 ప్రభాతవార్త:** సాంకేతిక విద్యా శాఖ ప్రవేశ పెట్టిన పాలిసెట్ 2025 అడ్మిషన్లకు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో భాగంగా సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఈనెల 27 నుండి ప్రారంభం అవుతుందని పాలెం శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ఎ) ప్రిన్సిపల్ డా. పి.రాములు బుధవారం తెలిపారు. వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ కోసం ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 27,28,29 తేదీలలో వారికి కేటాయించిన తేదీలలో కళాశాలలో హాజరుకావాలని సూచించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ హాజరయ్యే విద్యార్థులు తమ వెంట టిసి ఒరిజినల్, పదవ తరగతి లేదా సమాన అర్హత గల మార్కుల మెమో,బోనఫైడ్ సర్టిఫికెట్, కులం, ఆదాయం సర్టిఫికెట్, స్థానిక ధృవీకరణ సర్టిఫికెట్, ఆదార్ కార్డు అన్నింటినీ రెండు జతల జిరాక్స్‌లతో పాటు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తమ వెంట తీసుకురావాలని తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కరపత్రం విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

**ఉట్కూరు, జూన్ 25 ప్రభాతవార్త:** ఉట్కూరు మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. క్యాంపులో మొత్తం 95 మందికి బిపి, షుగర్,తెమడ పరీక్ష మొదలైనవి పరీక్షలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డా.ఆర్ సంతోషి వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రతి ఒక్కరూ తిను పదార్థాలు త్రాగునీటిని కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు వండిన పదార్థాలు తినాలి అని పరిసరాల పరిశుభ్రత పాటించాలని వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని తెలియజేయడం జరిగింది. ఎక్కడ కూడా నీటి గుంతలలో నీటిని నిల్వ ఉండకుండా చూడాలని పైపు లైన్లు లీకేజీలు ఎక్కడైనా ఉంటే అది మరమ్మతు చేయించాలని చెప్పడం జరిగింది. నీటిని కాచి చల్లార్చి తాగాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. ఆర్ సంతోషి తో పాటునరసింగమ్మ ఏం.ఎల్ హెచ్.పి. పర్యవేక్షకులు నరసింహులు జిల్లా టీబీ కోఆర్డినేటర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్ ,ఆరోగ్య కార్యకర్త మహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకు ఘన సన్మానం

**మాగనూర్,జూన్25 ప్రభాతవార్త:** మాగనూర్ మండలానికి నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును బుధవారం ఆయన చాంబర్‌లో మాగనూర్ మండలం బిజెపి నాయకులు శాలువతో సన్మానించారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారంతోపాటు, మండల అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో భారతీయ జనతా పార్టీ మాగనూర్ ఉమ్మడి మండల ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్, ఉపాధ్యక్షులురాంగోపాల్, మండలకార్యవర్గ సభ్యులు ఆంజనేయులుగౌడ్, బిజెపి నాయకులు భీంరాజ్, సుమన్‌లు ఉన్నారు.



## మూడు సార్లు రైతు బంధు ఎగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

### భారతీయ కిసాన్ మోర్చా అధ్యక్షుడు దేవరింటి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**మక్తల్ టౌన్, జూన్25 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు రైతు భరోసా మూడుసార్లు ఇవ్వాల్సిన చోట కేవలం ఒక్కసారి మాత్రమే రైతు భరోసా వేసి రైతు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదం అని భారతీయ కిసాన్ మోర్చా అధ్యక్షుడు దేవరింటి నరసింహ రెడ్డి పేర్కొన్నారు.అదే విధంగా రైతు రుణ మాఫీ 50% కూడా పూర్తి కాలేదు కానీ 100% పూర్తి ఐనది అని చెప్పడం సిగ్గు చేటు అన్నారు. గత యాసంగిలో రైతులు ప్రభుత్వానికి అమ్మిన ధాన్యానికి కేవలం కేంద్ర ప్రభుత్వం నుండి మద్దతు ధరకి సంబందించిన డబ్బులు మాత్రమే వేసి రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తామన్నా బోనస్ ఐదువందల రూపాయలు దాదాపు రెండు నెలలు ఐనా చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే బోనస్ చెలించాలని మాజీ ఎంపిటిసి బలరాంరెడ్డి డిమాండ్ చేయడం జరిగింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, బీజేపీ నాయకులు స్వాగత సత్యనారాయణ, లక్ష్మీపతి పాల్గొనడం జరిగింది.

## బిజెపి ఆధ్వర్యంలో వికసిత భారత్ రచ్చబండ కార్యక్రమం



రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**దామరగిద్ద, జూన్25 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలంలోని మొగల్ మడ్క గ్రామం శక్తి కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో 11 సంవత్సరాల నరేంద్ర మోడీ పాలనపై ప్రజలతో మమేకమై చర్చించడం జరిగింది ,కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి పథకాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. వికాసి భారత్ లక్ష్యంగా గౌరవ నరేంద్ర మోడీ సుపరిపాలన అందిస్తున్నారని ప్రజలకు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా రాబోయే స్థానిక ఎన్నికల్లో బిజెపికి అత్యధిక సీట్లు ఇచ్చి గెలిపించాలని ప్రజలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు సంజీవ్ గౌడ్, రాష్ట్ర బీజేవైఎం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి , మండల ప్రధాన కార్యదర్శి మంగలి నారాయణ, శక్తి కేంద్రం ఇంచార్జి అంజయ్య గౌడ్, బిజెపి మండల దళిత మోర్చా అధ్యక్షులు సాయిలు,యువ నాయకులు మోనేష్ చారి, వెంకటప్ప ,రాము,గోపాల్ చారి ,మహేష్ గౌడ్, హన్మంతు గౌడ్, పరమేష్‌చారి,గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో రూ.243.46కోట్లు జమ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 25, ప్రభాతవార్త:** రైతు భరోసా నిధులు మహబూబ్‌నగర్ జిల్లాలోని 2,15,148మంది రైతులకు 243 కోట్ల 46 లక్షల 85వేల రూపాయలు రైతు భరోసా నిధులు బుధవారం వరకు రైతుల ఖాతాల్లో జమ కావడం జరి గిందని జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్ తెలిపారు. రైతు లకు సాగు అవసరాలకు ఉపయోగపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16 నుండి రైతు భరోసా నిధులు నేరుగా రైతుల ఖాతాలకు జమ చేస్తున్నట్లు తెలిపారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభు త్వం చేపట్టిన రైతు భరోసా పథకం కింద ఈ నిధులు పంపిణీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.ఈ సాయంతో రైతులు విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు అవసరాలకు వినియోగాయానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తా చాటుదాం

### బీసీ కుల సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్ల ఆంజనేయులు

**దేవరకద్ర, జూన్ 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల జెండా ఎగురవేయాలని బీసీ కుల సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ సీట్లలో కూడా బీసీలు నిలబడి గెలవాలని, ప్రజలతో కలిసి పనిచేసి, వారి నమ్మకాన్ని పొంది సర్పంచ్, వార్డ్ నెంబర్, ఎంపిటిసి, జడ్పిటిసి, లుగా బీసీ నాయకులు గెలవాలని కోరారు. బీసీలు పార్టీల వారీగా విడిపోకూడదని, కచ్చితంగా గెలిచేలా వ్యూహాత్మకత పాలో కావాలన్నారు.మన లక్ష్యం రాజ్యాధికారం కావాలి అని బీసీ కుల సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్ల ఆంజనేయులు అన్నారు.

## యువకుడు అదృశ్యం : కేసు నమోదు

**నవాబుపేట, జూన్ 25 ప్రభాతవార్త :** అకారణంగా దాయాధులు యువకునిపై దాడి చేయగా మనస్థాపానికి గురై తన భర్త కనిపించడం లేదని పోలీసులను ఆశ్రయించిన ఘటన మండల పరిధిలోని దొడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల మంజుల భర్త యాదగిరి తమ పొలంలో 23వ తారీకు సోమవారం అందాజా సాయంత్రం 5 గం.ల సమయంలో పనిచేసుకుంటుండగా పాలివారైన దాయాధులు ముగ్గురు వ్యక్తులు పిచ్చకుంట్ల రాజు శ్రీనురాములు వచ్చి మంజుల భర్త పిచ్చకుంట్ల యాదగిరి పై దాడి చేయగా ఇంటికి వెళ్లిన యాదగిరి మనస్థాపానికి గురై కనిపించకుండా పోయాడని బంధువుల అందరిని ఫోన్లో విచారించగా ఎక్కడ లేదని తెలియడంతో పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## భగవత్ స్వరూపం అన్నదానం

**నారాయణపేట టౌన్, జూన్ 25 ప్రభాతవార్త:** అన్ని దానాల కన్నా అన్నదానం విన్నాయని అన్నాదానాన్ని మించింది మరొక దానం లేదన్నారు అయ్యప్ప దేవాలయ అధ్యక్షులు మనోహర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు.అమావాస్య సందర్భంగా బుధవారం నారాయణపేట పట్టణంలోనిఅయ్యప్ప దేవాలయ అధ్యక్షుడు మనోహర్ ప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో శరణఘోషలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, శేఖర్ రెడ్డి,చెన్ బస్సయ్య, లింగు బాల్‌రాజ్, రాజు, రాంరెడ్డి, నాగేష్, రవి,సైదప్ప, శంకర్‌తో బాటు తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియమక పత్రాన్ని అందుకున్న పేట ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, జూన్ 25 ప్రభాతవార్త:** టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రాన్ని నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులు మీదుగా అందుకున్నారు. అనంతరం సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే వర్ణిక రెడ్డి నియోజక వర్గంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యల గురించి చర్చించారు.

## 27న చలో ఇందిరాపార్క్‌ని జయప్రదం చేయండి

### టిపిటిఎస్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప

**నారాయణపేట టౌన్, జూన్ 25 ప్రభాతవార్త:** విద్యారంగం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వీడాలని ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయాలని ప్రైవేట్ కార్పొరేటీ కరణ విధానాలను వీడాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం నారాయణపేట జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భగత్ సింగ్ భవన్లో సన్నాక సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టిపి టిఎఫ్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014లో తన బడ్జెట్లో ఆరు శాతం నిధులను కేటాయించి 2025 నాటికి 2.6 నిధులతో సరి పెట్టిందని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీకి విరుద్ధంగా కేవలం గత ప్రభుత్వం కంటే 0.6 ని పెంచి 7.6నిధులతో విద్యారంగాన్ని గాలికొదిలేసిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూలు యంగ్ ఇండియా స్కిల్‌యూనివర్సిటీలను మోడల్‌గా చూపుతూ ప్రభుత్వరంగంలో పనిచేస్తున్న పాఠశాలలు కళాశాలలు యూనివర్సిటీలను నిర్లక్ష్యానికి గురిచేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 27న హైదరాబాదులోని ఇందిరాపార్క్ దగ్గర జరిగే ధర్నాలు విద్యా పరిరక్షణ కమిటీ భాగస్వామ్య సంఘాల బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిపి టిఎఫ్ నాయకులు రామకృష్ణ, వెంకటప్ప, బాలరాజ్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్.సాయికుమార్, బోయినపల్లి రాము, కృష్ణ, మారుతి, వసుంధర, అనిత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల క్షేత్రంలో తిరిగి ప్రారంభం కానున్న స్పర్శ దర్శనాలు : శివానంద స్వామి

**నారాయణపేట, జూన్ 25 ప్రభాతవార్త:** శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల దేవస్థానంలో జులై 1 నుండి ప్రతిమంగళవారము నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం 1:45 నిమిషాల నుండి సాయంత్రం 3:45 నిమిషాల వరకు భక్తులందరికీ ఉచితంగా శ్రీ మల్లికార్జున స్వామి వారి స్పర్శ దర్శనం పునఃప్రారంభిస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలియజేశారు. దాదాపు 10నెలల తర్వాత సామాన్య భక్తులకు స్పర్శ దర్శనాన్ని తిరిగి ప్రారంభించినందుకు ఇట్టి అవకాశాన్ని భక్తులందరు సద్వినియోగం చేసుకోవాలని కొత్తకోట శివానంద స్వామి కోరటం జరిగింది.స్పర్శ దర్శనాన్ని ఏర్పాటు చేసిన దేవస్థాన పాలకమండలి, ఈఓ శ్రీనివాస్ రావ్ కృతజ్ఞతలు తెలియచేసారు.

## మిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య పూజలు

**పెబ్బేరు, జూన్ 25 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలోని మిట్ట అంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకా, తమల పాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అమావాస్య అల్పాహార దాత మిట్ట భక్తాంజనేయ స్వామి ఆలయంలో జరిగే మన ఊరు మన భజన కార్యక్రమంలో అల్పాహార దాతగా సహకరించిన వట్టిపల్లి శేఖర్ రెడ్డి ధర్మపత్ని కృష్ణమ్మ,జ్ఞానేశ్వర్ రెడ్డి భారతి,నాగేశ్వర్ రెడ్డి పావని, భజనపరులకు భక్తులకు అల్పాహారం వితరణ చేశారు.కుటుంబ సభ్యులకు శ్రీ స్వయంభూ మిట్ట భక్తాంజనేయ స్వామి వారి యొక్క అనుగ్రహం, ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆలయ పూజారి నవీన్ స్వామి వారిని దీవించారు.

## ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు సీజ్

■ టీజీవీపీ జిల్లా కార్యదర్శి కేదార్నాథ్ యాదవ్


సీజ్ చేసిన పుస్తకాలు

**వనపర్తి రూరల్, జూన్ 25, ప్రభాతవార్త:** ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు సీజ్ చేయించినానని టీజీవిపి జిల్లా కార్యదర్శి కేదార్నాథ్ యాదవ్ తెలిపారు. తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని నంది హిల్స్ కాలనీలోని మామ్స్ విజన్ పాఠశాలలో అక్రమంగా పుస్తకాలను విక్రయిస్తున్నారని తల్లిదండ్రుల నుంచి సమాచారం రావడంతో టీజీవిపి జిల్లా కార్యదర్శి కేదార్నాథ్ సందర్శించారు. అక్కడి నుంచి స్థానిక మండల విద్యాధికారి మద్దిలేటి కి సమాచారం ఇవ్వడంతో ఆయన పాఠశాలను సందర్శించి పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేశారు. పాఠశాలలో పుస్తకాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు టిజీవీపి నాయకులు, విజయ్, కార్తీక్, మనీ, శివ, దేవి పాల్గొన్నారు.

### ప్రైవేట్ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అమ్మడం

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం

■ మల్దకల్ మండల ఎంఈఓ సురేష్



పుస్తకాల రూమును సీజ్ చేస్తున్న ఎంఈఓ

**మల్దకల్ జూన్ 25,ప్రభాతవార్త :** మల్దకల్ కేంద్రంలో ఉన్న న్యూ ట్రినిటీ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్ ఎక్కువ ధరకు అమ్ముతున్న సమాచారాం తెలియడంతో ఎంఈఓ అక్కడికి చేరుకొని పరిశీలించారు .ప్రైవేట్ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు స్కూల్ యూనిఫామ్స్ అమ్మడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని వెంటనే ఆ పుస్త కాల రూంను సీల్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్దకల్ మండల ఎంఈఓ సురేష్, వారి సిబ్బంది విజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

## పేట అభివృద్ధికి ఎంపీ అరుణమ్మ కృషి

◆ ఏడాది పాలనలోనే దాదాపు 600 కోట్ల మంజూరు
◆ కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్



**నారాయణపేట ప్రతినిధి జూన్ 25 ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎంపీ డికె అరుణ ఏడాది పాలన పూర్తి అయిందని అందుకు అభినందనలు తెలిపారు. నారాయణపేట జిల్లాకు మొదటి సంవత్సరంలోనే దాదాపు 600 కోట్లతో కొత్తగా జిల్లా కేంద్రం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి ఎన్ హెచ్ 167ను నాలుగువరసలుగా మార్చేటందుకుగాను వికసితభారత్‌లో భాగంగాఅరుణమ్మ ఏడాది పాలనలోనే మంజూరు చేసినందుగాను నారాయణపేట జిల్లా ప్రజల తరపు న తెలుపుతూ కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ తరుపున ఎంపీ అరుణమ్మకు ధన్యవాదములు తెలిపారు. పాలమూరు పార్లమెంటరీ పరిధిలో విస్తరించబడి ఉన్ననారాయణపేట జిల్లా ప్రజలు గత పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ అరుణమ్మకు అత్యధిక ఓట్లు వేసినం దుకుగాను రుణం తీర్చుకున్నారని అంతేకాకుండా మొదటి ఏడాదిలోనే విరామం లేకుండా పాలమూరు పార్లమెంటరీ పరిధిలో ముఖ్యంగా నారాయణపేట జిల్లాలో అనేక పల్లెలకు విస్తృతి విస్తృతంగా పర్యటిస్తూనేఅటు ఢిల్లీలోకూడా సంబంధిత మంత్రిత్వశాఖల ద్వారా కృష్ణా వికారాబాద్ రైల్వే లైన్ జీవో 69 అమలు అతిపెద్ద నేషనల్ హైవే ఎన్ హెచ్ 44 కు అభివృద్ధి పరుచుటలో గాని నిరంతరం శ్రమిస్తున్న ప్రజా శ్రమజీవి ఎంపి అరుణమ్మ దొరకడం పేట ప్రజల అదృష్టం అన్నారు.

## లాసెట్‌లో 36వ ర్యాంకు సాధించిన సాయి ప్రణీత

**వెల్దండ, జూన్ 25 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన పూజారి రాఘవేందర్ శర్మ కమలా దంపతుల కుమార్తె సాయి ప్రణీత బుధవారం వెలువడిన లా సెట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 36వ ర్యాంకు సాధించారు. చిన్ననాటి నుండి కష్టపడి చదివి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు సాయి ప్రణితను అభినందించారు. న్యాయవాద వృత్తిలో ఉన్నత స్థానం చేరుకోవాలని ఆకాంక్షించారు..

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక

**నారాయణపేట టౌన్, జూన్ 25 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ సేవాలను జిల్లాలోని ప్రతి గ్రామలో పేదలతోపాటు విద్యార్థులకు సేవాలు అందించి లయన్స్ క్లబ్ అభివృద్ధి కి ప్రతిఒక్క సభ్యులు కృషి చేయాలని లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ డా. మహేందర్ కుమార్ రెడ్డి, వైస్ డిస్టిక్ గవర్నర్ సురేష్ జిజ్ఞాని అన్నారు. బుధవారం కర్ణాటక రాయచూరు జిల్లా కేంద్రంలో రీజన్ 3 లయన్స్ క్లబ్ సభ్యుల సమావేశంలో నారాయణ పేట జిల్లాకు చెందిన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సరిత హరి నారాయణ్ బట్టడ్ కార్యదర్శిగా సాయినాథ్ ఉపాధ్యక్షులుగా రవికుమార్ గౌడ్, కోశాధికారిగా రాధ సదానంద్ చారిలను ఎంపిక చేసి నియామాక పత్రం అందించి సత్కరించారు. ఈసందర్బంగా సరిత హరి నారాయణ్ బట్టడ్ మాట్లాడుతూ పేట లయన్స్ క్లబ్ నుండి తొలి మహిళా అధ్యక్షురాలుగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. నాపై నమ్మకం ఉంచి నన్ను నియమించినందుకు లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్‌తో పాటు లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ గవర్నర్ డా. హరి నారాయణ్ బట్టడ్, సెకండ్ వైస్ గవర్నర్ డా. శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విపత్తులపై కార్యాచరణ రూపొందించండి

◆ హై రిస్క్ ప్రాంతాలను గుర్తించండి ◆ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం

**మహబూబ్నగర్ బ్యూరో, జూన్ 25, ప్రభాతవార్త:** ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణ కంటే ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో జిల్లాల్లో వర్షాలు, వరదల వల ప్రాణ, ఆస్థి, ఆర్థిక నష్టం జరగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు తీసుకొంటూ అప్రమత్తంగా ఉండాలని,ఆయా శాఖల అధికారులు,ఎం.పి.డి. ఓ.లు,తహశీల్దార్ లు వరద నిర్వహణ పై తీసుకోవలసిన చర్యలపై నివేదించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఎం.పి.డి. ఓ.లు,తహశీల్దార్ లు,జిల్లా అధికారులతో వరద నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించేదానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాలు,వరదల వలన గత 5 సంవత్సరంలలో,గత ఏడాదినష్టం జరిగిన ప్రాంతాలు హైరిస్క్ ప్రాంతాలు గుర్తించి ఎం.పి.డి. ఓ.లు, తహశీల్దార్ లు,ఇరిగేషన్,అగ్నిమాపక, పంచాయితీ రాజ్,జిల్లా పంచాయతీ అధికారి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,అర్. బి,విద్యుత్ శాఖలు,మిషన్ భగీరథ శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్పించాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత

◆మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి




**మహబూబ్‌నగర్‌బ్యూరో, జూన్25, ప్రభాతవార్త:** మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అని, పోరాటం విద్యార్థుల నుంచి ప్రారంభమవ్వాలని మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.వి శ్రీనివాస్, ఎస్పీ డి. జానకి హాజరయ్యారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ "మాదకద్రవ్యాల వినియోగం సమాజాన్ని మానసిక, శారీరక, ఆర్థికంగా నాశనం చేస్తోందని, ఈ విషపూరిత ధోరణిని రాబోయే తరం నుంచి నిర్మూలించాలన్నారు. విద్యార్థులు తమ కుటుంబాలను, స్నేహితులను, పరిసరాలను డ్రగ్ ఫ్రీగా మార్చే లోక సేవా దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించి ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాదకద్రవ్యాల అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి, వాటిని యువతలో చైతన్యం కలిగించేలా రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్ బాబు గారు, డాక్టర్ కె. ప్రవీణ్ (ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్), బి.డబ్ల్యు.ఓ. జరీనా, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణ రెడ్డి, మహబూబ్ నగర్ రూరల్ సీఐ గాంధీ, ఐటీకోర్ టీం ఇంచార్జ్ ఎస్ఐ రాఘవేందర్ మరియు ఇతర పోలీస్ అధికారులు, యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

◆ నిర్దేశించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి కావాలి
◆ అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలి
◆ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్25 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశాలు, అచ్చంపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులును ఆదేశించారు.నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించుకుంటూ, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వారు సూచించారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయంను నియమించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశంలో శాఖల వారీగా సమీక్ష చేపడుతూ కొండారెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్దేశించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. మంజూరు అయిన పనులను వేగవంతం చేసి పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల విస్తరణ,రోడ్ల బలోపేతంకు సంబంధించి పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి శాఖల ఇంజనీర్లు ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థల సేకరణతో పాటు అందుకే కావలసిన ప్రభుత్వ అనుమతుల ప్రతిపాదనలను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కొండారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు 100శాతం నమోదు జరిగేలా కృషి చేయాలని, కొండారెడ్డిపల్లి పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, పాఠశాల ఆవరణలోనే అదనంగా ఒక అంగన్వాడి భవనాన్ని నిర్మించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో లైబ్రరీ, బ్యాంకు, పోస్ట్ ఆఫీస్ సేవలకు కావలసిన భవనాల ఏర్పాట్లు తదితర అంశాలపై శాఖల వారీగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రతి పనినీ నిర్దేశించిన సమయానికే పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా ఏ అవసరమైన తనను ఎల్లవేళలా సంప్రదించవచ్చని కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాట్లకు కావలసిన ప్రతిపాదనలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న రహదారి విస్తరణ పనులకు వేగంగా పెంచాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పాల శీతలీకరణ కేంద్ర భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, వాటిని ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకు రావాలని తెలిపారు. విద్యుత్ లైన్లను భూమి లోపల నుండి ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో విద్యుత్తు లైట్లుకు సోలార్ విద్యుత్ అందించాలని,వీధి లైట్ల ఏర్పాటుకు అవసరమైన కరెంటు స్తంభాలను సిద్ధం చేయాలని, కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ కార్యక్రమం కింద మంచి నీటి సరఫరాకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. త్రాగునీటి సరఫరా కోసం నూతనంగా వాటర్ ట్యాంక్ నిర్మాణాన్నిచేపట్టాలని కలెక్టర్ కోరారు. అలాగే, కొండారెడ్డిపల్లి గ్రామాన్ని వంద శాతం సోలార్ విద్యుత్ గ్రామంగా అభివృద్ధి చేయాలని రెడ్కో అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్వగ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని, అభివృద్ధి పనులకు కావలసిన నిధులు ఇప్పటికే మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదనంగా చేపట్టిన పనులకు కావాల్సిన అనుమతులకు అవసరమైన మంజూరు ప్రక్రియను వేగవంతంగా చేపట్టేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గానికి గుర్తింపు వచ్చేలా కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగాపూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. వివిధ శాఖల జిల్లా మండల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తుతో జీవితాలు చిత్తు

-యువత చెడు దారులు పట్టొద్దు : డీఎస్పీ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

**కల్వకుర్తి, జూన్ 25 ప్రభాతవార్త:** నేటి ప్రస్తుత సమాజంలో యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. యువత చెడు మార్గంలో ప్రయాణించకుండా మంచి మార్గాన్ని ఎంచుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంరక్షణ నిర్వహణ బాధ్యతలో ఉండాలన్నారు. కల్వకుర్తి పట్టణంలోని వైఆర్ఎం జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సదానందంగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ డ్రగ్స్ నివారణ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి డిఎస్పి వెంకట్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి, ఎస్ఐ మాధవ రెడ్డి, కరస్పాండెంట్ రాజేందర్‌లు హాజరైనారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ భూతాన్ని వాడకం వల్ల యువత దీనికి బానిసై బలైపోతున్నారు. ఇది సరదాగా మొదలై అలవాటుగా తయారై వ్యసనంగా మారి విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. ఆరోగ్యం చెడిపోయి జీవితం అర్థాంతరంగా ముగుస్తుందని,డ్రగ్స్ వాడకానికు దూరంగా ఉండాలని విద్యార్థులకు డిఎస్పీ వెంకట్ రెడ్డి సూచించారు. సైబర్ క్రైమ్ నివారణకు ప్రతి ఒకరు కృషి చేయాలని ఎస్సై మాధవ రెడ్డి పేర్కొన్నారు. విద్య, విజ్ఞానము, చదువు సంస్కారం ,క్రమశిక్షణ, దేశభక్తి పెంపొంచుకోని విద్యార్థులు ముందుకు నడవాలని ప్రిన్సిపాల్ సదానందం గౌడు అన్నారు. ముఖ్య అతిథులనుకళాశాల అధ్యాపకబృందం శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు యాదయ్య ,బాలరాజు, రామకృష్ణ ,యాదగిరి గౌడ్, హుస్సేన్,శ్రీనివాస్, శ్రీశైలంగౌడ్ ,ఇదన్నయ్య,ప్రభాకర్ గౌడ్,వెంకటయ్య, శరత్ మొదలగు విద్యార్థులు పాల్గొన్నారు.

### వర్గీకరణ ఫలితాలు అందిపుచ్చుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**ఆత్మకూర్ జూన్25,ప్రభాతవార్త :** మాదిగ రిజర్వేషన్ పోరాటం సమితి ఆధ్వర్యంలో సాధించినటువంటి ఎస్సీ వర్గీకరణ ఫలితాలను మాదిగ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి జంగయ్య మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి అచ్చపాక లక్ష్మణ్ తదితరులు పిలుపునిచ్చారు ఈ మేరకు బుధవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మహాజన మాదిగ ముఖ్య కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్య అతిథులకు హాజరై మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో జూలై ఏడవ తేదీన 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు గ్రామ గ్రామాన మాదిగలు పనిచేయాలని వారు విజ్ఞప్తి చేశారు దేశంలోనే అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ అవార్డును అందుకొని మాదిగ జాతికి అంకితం చేసిన మందకృష్ణ మాదిగ పోరాటపటిమను గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం నిర్వహించి మాదిగలను చైతన్యవంతం చేసేందుకు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఉపయోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమానికి ఆత్మకూరు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దండు శ్రీనివాసులు అధ్యక్షత వహించగా ఎమ్మార్పీఎస్ నాయకులు సోంబాబు జానకి రాములు జపాగా మాసన్న శ్యాం కుమార్ కురుమన్న గణేష్ మహేష్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దొరికిన బంగారు ఆభరణం అప్పగింత

**చిన్నంబావి, జూన్25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గూడెం గ్రామానికి చెందిన గంగాధర్ సోమవారం రోజు జటప్రోలు యూనియన్ బ్యాంకు దగ్గర గోల్డ్ లోన్ నిమిత్తం బ్యాంకు దగ్గరకు వచ్చి మూడు తులాల బంగారు ఆభరణాన్ని పోగొట్టుకోవడం జరిగింది. అదే మండలంలోని కొప్పునూరు గ్రామానికి చెంది నవద్దెమాన్ చెన్నమ్మ బ్యాంకు పని నిమిత్తం యూనియన్ బ్యాంకు దగ్గరికి వెళ్ళగా మూడు తులాల బంగారు ఆభరణం చెన్నమ్మకు దొరికింది. దొరికిన ఆ బంగారాన్ని వద్దెమాన్ చెన్నమ్మ, భర్త బాలస్వామి వద్దెమాన్ విష్ణు వర్మ ,వద్దెమాన్ లక్ష్మణ్ సంధ్యాపోగు భారతి కేతపోగు నందకిశోర్ లు అట్టి బంగారు ఆభరణాన్ని యూనియన్ బ్యాంకు మేనేజర్ ద్వారా గంగాధర్‌కు అందజేయడం జరిగింది. దీంతో చెన్నమ్మను పలువురు అభినందించారు.

## ఎమర్జెన్సీ దేశానికి చీకటి రోజు

బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ



**నారాయణపేట టౌన్, జూన్ 25 ప్రభాతవార్త :** యాభై ఏళ్ల క్రితం నాటి ఎమర్జెన్సీ కాలం దేశ ప్రజలకు చీకటి రోజు అని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ అన్నారు. బుధవారం నారాయణపేటలో బిజెపి వికారాబాద్ జిల్లా ఇంఛార్జి పగుడాకుల శ్రీనివాసులు, నారాయణపేట బిజేపీ జిల్లా అధ్యక్షుడు కె.సత్య యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాటి ప్రధాని ఇందిరాగాంధీఅధికార దాహంతో కోర్టు తీర్పును అపహస్యం చేస్తూ ఒక్క కాలం పాటుతో దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించి అరాచకాలకు పాల్పడ్డారని అన్నారు. ఎందరో నాయకులు ప్రముఖులను అరెస్ట్ చేయించి ఇబ్బందులు కల్పించారని అన్నారు. అధికారాన్ని కాపాడుకోవడం కోసం రాజ్యాంగాన్ని సవరించి తూట్లు పొడిచారని అన్నారు. చివరకు పత్రిక స్వేచ్ఛను కాలరాసిందని విమర్శించారు. కానీ తరువాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిగా గల్లంతు అయి ఇందిరాగాంధీ కనీసం డిపాజిట్ దక్కించు కోలేక పోయార అన్నారు.ఎమర్జెన్సీ తో ఇబ్బందులుపడ్డ ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిబుద్ధి చెప్పారని అన్నారు. నేడు కూడా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణ అంటూ రాహుల్‌గాంధీ చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

## చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయండి

**మానవపాడు,జూన్ 25 ప్రభాతవార్త:** చిన్నోనిపల్లి రిజర్వాయర్ లింక్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే విజయుడు కోరారు.ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో మంత్రిని ఎమ్మెల్యే విజయుడు స్థానిక నాయకులతో కలిసి పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌తో ఎమ్మెల్యే:** హైదరాబాద్ లోని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే విజయుడు కలిశారు. అలంపూర్‌లోనిబుక్కాపురం లిఫ్ట్ ఇరిగేషన్‌కు కొత్త మోటర్లు ,పంపుసెట్లు ఉట్కూరు 1 క్యాతూరు, గొందిమల్ల,అలంపూర్ లోని లిఫ్ట్ ఇరిగేషన్లకు మోటార్లను మెయింటెనెన్స్ చేసి వచ్చే రబీ సీజన్ నాటికి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు.ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ అశోక్ రెడ్డి, రఘురెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.


మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

## నేడు విద్యుత్ అంతరాయం

**నారాయణపేట ప్రతినిధి,జూన్ 25 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం చిన్న జట్రం 33/11 ఉప విద్యుత్ కేంద్రం పరిధిలో ఉన్న 11. కె.వి. కొల్లంపల్లి ఫీడర్ మరమ్మత్తు పనులు ఉన్నందున నేడు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని గ్రామీణ ఏఈ సాయినాథ్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఈ ఫీడర్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

**ఖిల్లాగణపురం. జూన్ 25, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన అప్పారెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి భార్య ఎరుకలి అలివేలుకథనం ప్రకారం తన భర్త రాజు వయసు 32 సంవత్సరాలు అదే గ్రామానికి చెందిన నక్క వెంకటయ్య దగ్గర గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడని ఈనెల 24న మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో గొర్రెలు కడుగుతుండగా రాజు ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగి పోయాడని వెంకటయ్య ఈ విషయం తనకు ఫోన్ ద్వారా తెలియజేయగా తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లానని బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో చెరువులో రాజు మృతదేహాన్ని గుర్తించామని చెప్పారు. మృతుడికి గత రెండు సంవత్సరాలుగా ఫిట్స్ వ్యాధి ఉందని ఫిట్స్ వచ్చినప్పుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఆమె తెలిపింది. ఈ సంఘటనపై తనకు ఎలాంటి అనుమానాలు లేవని తగిన చర్యలు తీసుకోవాలని స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సురేష్ గౌడ్ తెలిపారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ఉరి వేసుకుని యువకుడి మృతి

**మద్దూర్, జూన్ 25 ప్రభాతవార్త:** ఉరి వేసుకుని ఓ యువకుని మృతి చెందిన సంఘటన మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుపాకీ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తుపాకి తండాకు చెందిన కేతావత్ సురేష్ (18) కడుపునొప్పి బాధ భరించలేక మంగళవారం రోజు తన చిన్నాన్న ఇంటిలో చున్నితో ఉరివేసుకుని మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. తండ్రి కేతావత్ లింబే నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం మృత దేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఎస్సై వివరించారు.

## భీంషన్ రావు కుటుంబాన్ని పరామర్శించిన మక్తల్ మాజీ ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, జూన్ 25 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణ సీనియర్ రిపోర్టర్ కే. భీంషేన్ రావు సతీమణి కే.నాగమణి (49) గుండె పోటుతో మృతి చెందగా బుధవారం మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. భీంషేన్ రావుతో పాటు ఇద్దరు కుమారులు రఘుప్రేమ్, వెంకటేష్ ప్రసాద్‌లను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఆ భగవంతుడు బాధిత కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ మార్కెట్ చెర్మన్ నరసింహా గౌడ్, సుదర్శన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి,లైన్స్‌క్లబ్‌సభ్యులు గందె రవికాంత్, రవికుమార్ ఉన్నారు.

## అన్నదానం మహా ప్రసాదం

**కల్వకుర్తి, జూన్ 25 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రతి నెల అమావాస్య రోజున అమావాస్య అన్నదాన ప్రసాదం పంపిణీ కార్యక్రమం గత మూడు నెలలుగా కొనసాగుతుందని ఆర్యవైశ్య మహాసభ సంఘం కల్వకుర్తి మండల అధ్యక్షులు గంధం కిరణ్ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు వాస శేఖర్‌లు అన్నారు. అందులో భాగంగా బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో 600 మందికి అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ సంఘం సభ్యులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, రిగార్డ్ గ్రేటర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తుతో జీవితం అంధకారం : సీఐ

**వెల్దండ, జూన్ 25 ప్రభాతవార్త:** మత్తు పదార్థాలకు బానిసలై జీవితమే ఒక అంధకారమవుతుందని సిఐ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో మత్తు పదార్థాల ఒక వారం వారోత్సవం సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన విద్యార్థులకు అవగాహన సమావేశంలో బుధవారం ఎస్సై కురుమూర్తితో కలిసి సిఐ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలను సేవించడం ద్వారా నియంత్రణ కోల్పోయి నేరాలకు పాల్పడతారని మత్తు పదార్థాలు ఎవరైనా అమ్మిన సేవించిన గానీ చట్టరీత్య చర్యలు ఉంటాయన్నారు. అంతకుముందు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## రైతు భరోసా డబ్బులు అందించండి

**గండీడ్, జూన్ 25 ప్రభాతవార్త:** మాకు రైతు భరోసా డబ్బులు రాలేదు రైతు భరోసా డబ్బులు వచ్చేలా చేయండి అంటూ కొండాపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు గండేడ్ మండల వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మేము మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 37, 60 లో భూమి పట్టాలు ఉన్నాయని,అందులోకొంతమంది రైతులకు రైతు భరోసా డబ్బులు వచ్చాయనీ, మరికొంతమంది రైతులకు రైతు భరోసా డబ్బులు రాలేదన్నారు. మాకు కూడా రైతు భరోసా డబ్బులు వచ్చేలా చూడాలన్నారు. చెన్నారం లక్ష్మి (మహిళా రైతు) మాట్లాడుతూ నాకు ఒక ఎకరం 30 గుంటలు భూమి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రైతు భరోసా డబ్బులు రాలేదనీ, అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్న ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రైతు భరోసా డబ్బులు రాలేదనీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతు భరోసా డబ్బులుఅందేలా చూడాలని ఆమెఅధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతులురెడ్డిపల్లి కృష్ణయ్య, మంగలి ఆంజనేయులు, కష్లాపురం నరసమ్మ, చెన్నారం చెన్నయ్య, బోరు హనుమయ్య, చెన్నారం చంద్రయ్య, చెన్నారం చెన్నయ్య, చెన్నారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు స్థిర ఆదాయం కల్పించాలి

**గద్వాల టౌన్, జూన్ 25, ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు స్థిర ఆదాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు.బుధవారం కేటీదొడ్డి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన మామిడి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెరుగుదల,నీటి సరఫరా,తోటల నిర్వహణ,పని నాణ్యత తదితర అంశాలపైసమీక్ష జరిపారు. తోటల నిర్వహణను పటిష్టం గా కొనసాగించాలని, ప్రతి మొక్కపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టి, రైతులకు దీర్ఘ కాలిక ఆదాయం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న భూములను ఉపయోగించి పంటలతో పాటు ఉద్యాన పంటలు,తోటలఅభివృద్ధి ద్వారా గ్రామీణవనరులను వినియోగించుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ, టెక్నికల్ అసిస్టెంట్,డిఆర్పి తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌పై ఏసీబీ దాడులు

మొదటి పేజీ తరువాయి భాగం..

డబ్బులిస్తే కానీ మీ సమస్యలు పరిష్కారం కావంటూ బెదిరింపులకు పాల్పడుతూ అమాయకల నుంచి అందిన కాడికి దోచుకొని అవినీతి అధికారులు ఖాజాను నింపుకుంటున్నారు. కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో 2వ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న రాంచందర్‌జీ బుధవారం రాత్రి రూ.10వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకుపట్టుబడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...కల్వకుర్తి మండలం గుండూర్ గ్రామానికి చెందిన నంబి వెంకటయ్య భూ వివాదం కేసు రాజీ కోసం ఎస్ఐ రాంచం దర్‌జీ రూ.20వేలు లంచం డిమాండ్ చేయగా రైతు వెంకటయ్య రూ.10 వేలు ఇస్తానని ఒప్పుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో పథకం ప్రకారంబాధిత వెంకటయ్య రూ.10వేలను ఇచ్చి2వ ఎస్ఐ రాంచందర్‌జీకి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకు న్నారు. సంబంధిత అధికారిని ఏసీబీ అధికారులు తమ కస్టడీలోకి తీసు కొని విచారణ నిర్వహించి గురువారం నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ప్రభుత్వఉద్యోగులు ఎవరైన లంచం అడిగితే ఏసీబీ అధికారులను సంప్రదించాలని,సమాచారమిచ్చినవారివివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.